క్లుప్తంగా

శుభ్రతతోనే వ్యాధులు దూరం

కన్నాయిగూడెం : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తేనే వ్యాధులు దరిచేరవని స్థానిక ఎంసీహెచ్ వైద్యులు ఎం.గిరి అన్నారు. మండలంలోని లక్ష్మీపురం, దేవాదుల తుపాకులగూడెం పాఠశాలల్లో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరి మాట్లాడారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఏఎన్ఎం సబిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా శ్రీనివాస్!

వాజేడు : మండల తహసీల్దార్‌గా శ్రీనివాస్‌ను జిల్లా ఉన్నతాధికారులు నియమించినట్లు సమాచారం. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన వీరభద్ర ప్రసాద్ మంగళవారం పదవీ విరమణ పొందారు. దీంతో తహసీల్దార్ పోస్టు ఖాళీ అయింది. ఈ స్థానంలో గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసి ములుగు కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లారు. వీరభద్రప్రసాద్ పదవీ విరమణ పొందటంతో శ్రీనివాస్‌ను తిరిగి ఇక్కడకు బదిలీ చేసినట్లు తెలిసింది. శ్రీనివాస్ త్వరలోనే బాధ్యతలను చేపట్టనున్నట్లు సమాచారం.

నంబర్ లేకున్నా ఇంటిపన్ను

ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని రంగాపూర్ గ్రామ పంచాయతీలో ఇంటి నంబర్ లేకున్నా ఇందిరమ్మ ఇళ్ల సర్వే పేరుతో పంచాయతీ కార్యదర్శి రవి కొంతమంది లబ్ధిదారుల నుంచి ఇంటి పన్ను వసూళ్లు చేస్తున్నారని స్థానికుడు విష్ణువర్ధన్ మంగళవారం ఆరోపించారు. రంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ ఇంటింటి సర్వేలో ఒకే ఇంట్లో మూడు కుటుంబాలు నివసిస్తున్నాయని ఇంటి నంబర్ ఒకటే ఉందన్నారు. ఆ మూడు కుటుంబాలకు ఇళ్లు కూడా లేదని గ్రామపంచాయతీలో ఇంటి నంబర్ కూడా లేకున్నా పంచాయతీ కార్యదర్శి ఇంటి పన్ను వసూళ్లు చేశారన్నారు. ఈవిషయంపై ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నాడన్నారు. కార్యదర్శి సొంత రశీదులు రాసి ఇస్తూ ఒక్కొక్కరి నుంచి ఇంటి నంబర్ పేరుతో రూ. 200 నుంచి రూ. 300 వసూళ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో కొంత మందికి సొంత ఇల్లు లేదు, గ్రామపంచాయతీలో ఇంటి నంబర్ నమోదు లేకున్నా ఇంటి పన్ను బలవంతంగా వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లికి చెందిన కట్కూరి కుమార్, సల్ల రవీందర్, బిజిగ శ్రీను తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. కాగా సీఈఐఆర్ సాయంతో పోలీసులు సెల్‌ఫోన్లను వెతికి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు సీఐ నరేష్‌కుమార్ అందజేశారు.

జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్

కాటారం : కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న జమిలి ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధమని ఉత్తర తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పీక కిరణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జమిలి ఎన్నికలతో ఏక పార్టీ బీజేపీ పాలన వస్తోందని ఆరోపించారు. బీజేపీ పాలన నిమ్న వర్గాల ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోందన్నారు. నల్ల చట్టాలను అమలు చేస్తూ రాజ్యాంగ బద్ధ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఎన్నికల వరకే బీజేపీ హిందువులం, బంధువులం అని అనంతరం గ్రామిక వర్గ ప్రజల మధ్య కులం, మతం అంటూ వైరుధ్యాలు సృష్టిస్తుందని కిరణ్ పేర్కొన్నారు.

నల్లి నివారణకు చర్యలు

చిట్యాల : రైతులు సాగు చేస్తున్న మిరప పంటలో నల్లి నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు ప్రగతి అగ్రిసైన్స్ డైరెక్టర్, జిల్లా వ్యవసాయ సంక్షేమ సంఘం సొసైటీ అధ్యక్షుడు సిరికొండ తిరుపతిరావు అన్నారు. ఈసందర్భంగా మంగళవారం మండలంలోని బావుసింగ్‌పల్లి, నవాబుపేట, చింతకుంట రామయ్యపల్లి గ్రామాల్లో రైతులతో కలిసి మిరప పంటలను పరిశీలించారు. మిరప పంటలో నల్లిపురుగు ఉధృతంగా ఉండడం వల్ల చెట్టు కోనలు మాడిపోవడం, నల్లబడిపోవడం జరుగుతుందన్నారు. రైతులు జాగ్రత్త వహించి నల్లి పురుగు నివారణకు కచ్చితంగా పని చేసే మందులను మాత్రమే పిచికారీ చేయాలని కోరారు. రెండేళ్ల నుంచి నల్లి ఉధృతిని గమనించి ప్రగతి సైన్స్ మార్గో పవర్ మందును వాడి మిరప పంటలను కాపాడుకోవాలని సూచించారు. ప్రగతి అగ్రిసైన్స్ డీలర్ సత్యం, రైతులు పాల్గొన్నారు.

యువకుడికి గాయాలు

భూపాలపల్లి అర్బన్ : గాలిపటం ఎగురవేసే మాంజా దారం మెడకు చుట్టుకొని ఓ యువకుడికి గాయాలైన సంఘటన భూపాలపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సుభాష్ కాలనీకి చెందిన సముద్రాల అజయ్ తన ద్విచక్ర వాహనంపై జయశంకర్ సెంటర్ నుంచి సుభాష్‌కాలనీ వైపునకు మంగళవారం వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో కూరగాయల మార్కెట్ సమీపంలో గాలిపటాలు చిన్నారులు ఎగురవేస్తుండగా దాని మాంజా అజయ్ మెడకు చుట్టుకుంది. దీంతో బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. మెడకు స్వల్పంగా కోసుకోవడంతో అతడికి రక్తస్రావమైంది. కాగా సదరు వ్యక్తి మాంజా గమనించకుండా వేగంగా వెళ్తే ప్రాణాపాయం కలిగేదని, ఆ యువకుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

అందని ఆధార్ సేవలు

- ఏజెన్సీవాసులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ఏటూరునాగారంలో మూసి ఉన్న ఆధార్ కేంద్రం

ఏటూరునాగారం : మండలంలోని ఏటూరునాగారం, కన్నాయిగూడెంల్లో శాశ్వత ఆధార్ నమోదు కేంద్రం లేక ప్రజలు, విద్యార్థులు, రైతులు అవస్థలు పడుతున్నారు.ఆధార్ అప్‌డేట్ కోసం ఇబ్బందలు పడాల్సి వస్తోంది. గతంలో ఉన్న ఆధార్ కేంద్రానికి సాంకేతిక సమస్య, అక్రమాలకు పాల్పడడంతో దానిని మూసివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆధార్ కేంద్రానికి అనుమతి ఇవ్వడం లేదు. చాలా మంది నిరుద్యోగులు ఆధార్ సెంటర్ కోసం నిబంధనల ప్రకారం ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలకు హాజరై ఉత్తీర్ణతను పొందారు. కేవలం బ్యాంక్, విద్యాసంస్థల అధీనంలో ఉండే ఆధార్ సెంటర్లు ఇవ్వడం వల్ల విద్యార్థులకు, బ్యాంక్ వినియోగదారులకే ఉపయోగపడుతుంది. అంతేకాకుండా కొంత మంది వృద్ధుల ఆధార్‌కు సెల్‌ఫోన్ నంబర్ లింక్ లేదని హైరానా పడుతున్నారు. అనేకమంది అవస్థలు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఆధార్ కోసం ముప్పతిప్పలు పడాల్సిన దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. ఆధార్ కార్డు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి ఆధార్ కేంద్రాన్ని తెరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

నాలుగు సార్లు తిరిగాను



ఆధార్ కార్డులో నా భార్య పేరు మార్చేందుకు ఇబ్బంది పడుతున్నాం. ఇక్కడ ఆధార్ కేంద్రం లేదని తాడ్వాయిలోని ఆధార్ కేంద్రానికి నాలుగుసార్లు తిరిగినా పేరు మారలేదు. ఇలాంటి ఇబ్బందులు అనేక మందికి ఉన్నాయి.

- ఇర్సవడ్ల సంతోష్

ఆధార్ కార్డు పోయింది

నా ఆధార్ ఒరిజినల్ కార్డు ఎక్కడో పోయింది. మళ్లీ తీసుకుందామని పోతే సెల్‌ఫోన్ నంబర్ యాడ్ చేసి ఉండాలని చెప్పారు. కానీ నంబర్ యాడ్ కాలేదు. దానివల్ల ఇతర మండలాల్లో ఉన్న కేంద్రాలకు వెళ్లినా అది జరగలేదు. ఇప్పుడు నాకు ఆధార్ లేక ఆర్టీసీ బస్సులో కూడా ఉచితంగా పోలేక పోతున్నా.

- గాజుల కొమురమ్మ, ఏటూరునాగారం

కాల్వల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు



స్లాబ్ కోసం కాంక్రీట్ వేస్తున్న కార్మికులు

ఎస్ఎస్ తాడ్వాయి : మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఇరువైపులా సైడ్ కాల్వల నిర్మాణం పనులు చేపట్టారు. అయితే సైడ్ వాల్‌పై స్లాబ్ పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్లాబ్ సీసీ పనుల్లో ఐరన్ మ్యాట్‌లో గేజ్ తక్కువగా ఉన్న స్టీల్, ఐరన్‌ను వినియోగిస్తు నామమాత్రంగా పనులు చేస్తున్నారు. కాంక్రీట్ పోసిన అనంతరం కాంక్రీట్ బలంగా వైబ్రేషన్ వినియోగించాల్సి ఉండగా తూతూ మంత్రంగానే పనులు చేపడుతున్నారు. సంబంధిత ఎన్‌హెచ్ అధికారుల పర్యవేక్షణ కూడా కరువైంది. వాటర్ క్యూరింగ్ కూడా చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికే నిర్మించిన సైడ్ కాల్వలు పగుళ్ల తేలి కనిపిస్తున్నాయి. కనీసం కొన్ని సంవత్సరాలు అయినా ఈ కాల్వలు నిలిచేనా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

కులగణనతో రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్

ములుగు రూరల్ : కులగణన ఆధారంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అచ్చునూరి కిషన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కామారెడ్డిలో ప్రకటించిన విధంగా బీసీ డిక్లేరేషన్ , మేనిఫెస్టోలో తెలిపిన విధంగా రిజర్వేషన్లు కేటాయించాలని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, భూమ నరేష్, మేకల రమేష్, కిరణ్, కౌశిక్, రఘుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయ గిరిజనులకు దుస్తుల పంపిణీ



గొత్తికోయలకు దుస్తులు అందజేస్తున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం : మండలంలోని కొమురం భీమ్ గొత్తికోయగూడెంలో గొత్తికోయ గిరిజనులకు స్థానిక ఎస్సై తాజొద్దీన్ నూతన దుస్తులు, పాదరక్షలను మంగళవారం పంపిణీ చేశారు. ఎస్పీ శబరీష్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు సీఐ అనుముల శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్సై గ్రామాన్ని సందర్శించి వారి కష్టాలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన సహకరించిన చూస్తూ ఊరుకునేది లేదని ఎస్సై హెచ్చరించారు. గొత్తికోయగూడెంలోకి అనుమానాస్పదంగా, కొత్త వ్యక్తులు సంచరించి నట్లయితే తమకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి



టేకుమట్ల : దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్‌కి మంగళవారం మండల కేంద్రంలో టేకుమట్ల సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు శ్రద్ధాంజలి ఘటించి, ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంగన్‌వాడీ టీచర్లు రామసల్ల స్వప్న, విమల, చంద్రకళ, తిరుపతమ్మ, భాగ్యలక్ష్మి, హిమబిందు, నిర్మల, విజయతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



భూపాలపల్లి రూరల్ : జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ కాకతీయ ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు మంగళవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ప్రజలు తమ సమస్యలు, వినతులు వెల్లడించడం కోసం ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ అవరమన్నారు. అధికారులు స్పందించి జిల్లా కేంద్రంలో ప్రెస్‌క్లబ్‌కు అనువైనా స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సామల శ్రీనివాస్, బెల్లం తిరుపతి, దొమ్మటి రవీందర్, తడుక సుధాకర్, దేవేందర్, సృజన్ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

గోవిందరావుపేట : మండలంలోని పలు పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో టీఎస్‌యూటీఎఫ్–2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గోవిందరావుపేట, బాలికల జెడ్పీహెచ్ఎస్ గోవిందరావుపేట, ఎంపీపీఎస్ చల్వాయి పాఠశాలల్లో మంగళవారం ఆ సంఘం మండల అధ్యక్షుడు ఈక లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుదేవ రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మండల విద్యాధికారి దివాకర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రఘురాం హాజరై ఆవిష్కరణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని, పీఆర్సీ రిపోర్టును తెప్పించి వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను, బిల్లులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలి



కమిటీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న గ్రామస్తులు

కన్నాయిగూడెం : గ్రామసభలు ఏర్పాటు చేయకుండా రహస్యంగా కాంగ్రెస్ కార్యకర్తలను ఎన్నిక చేసిన ఇందిరమ్మ కమిటీలని వెంటనే రద్దు చేసి ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించిన అధికారులను శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఐలాపూర్ మాజీ సర్పంచ్ మల్లెల లక్ష్మయ్య అన్నారు. మంగళవారం మండలంలోని ఐలాపూర్‌లో గ్రామస్తులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. షెడ్యూల్ గ్రామాల్లో 2018 చట్టానికి విరుద్ధంగా ఇందిరమ్మ కమిటీలు ఉన్నాయన్నారు. గ్రామ సభల ద్వారా ఇందిరమ్మ కమిటీలు వేయకుండా మండలంలోని గ్రామాల్లో అధికారులు కాంగ్రెస్ పార్టీకి కొమ్ము కాస్తూ రహస్యంగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేశారు. వెంటనే వాటిని తొలగించి గ్రామసభలు ద్వారా కమిటీలను ఎన్నుకోవాలని కోరారు. అధికారులు ఎలాంటి ప్రొటోకాల్ లేకుండా సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. కమిటీలను రద్దు చేయకుంటే ఐటీడీఏ, కలెక్టర్ కార్యలయాలను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో పెసా కమిటీ కార్యదర్శి నాగేష్, కేడె సుధాకర్, గుమ్మడి రామచంద్రయ్య, బాలయ్య, సుధాకర్, లక్ష్మీనారాయణ, సమ్మయ్య, నాగేష్, మల్లెల రాజేష రాఘవయ్య పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

- వైద్యాధికారి కొమరం మహేందర్



విద్యార్థినులను పరీక్షిస్తున్న వైద్యులు

వాజేడు : మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో 20 మంది విద్యార్థినులకు చర్మ సంబంధ సమస్యలు ఉన్నట్లు వైద్యాధికారి కొమరం మహేందర్ గుర్తించారు. వారి నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఏరియా వైద్యశాలకు పంపించారు. మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. విద్యార్థినులను పరీక్షించి మందులు అందించారు. వీరిలో 20 మందికి చర్మంపై పొక్కులు (కురుపులు) ఉన్నట్లు గుర్తించారు. మరో పది మంది విద్యార్థినిలకు చికిల్ సెల్ నిర్ధారణ పరీక్షలను చేశారు. విద్యార్థినిలకు సంబంధించిన మందులను ప్రధానోపాధ్యాయురాలు కేవీ కిరణ్మయి అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జలుబు, దగ్గు వంటి సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. తప్పని సరిగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. వంటగది, నిత్యావసర సరుకుల గదిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖల సిబ్బంది వెంకటరమణ, కోటిరెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, రజనీకాంత్, రాజేశ్వరి, లలిత కుమారి తదితరులు ఉన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



ఏటూరునాగారం: బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేస్తున్న ఎస్సై తాజొద్దీన్



గోవిందరావుపేట: డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తున్న ఎస్సై కమలాకర్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో మంగళవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. డిసెంబర్ 31 నేపథ్యంలో మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. పలువురు ద్విచక్రవాహనదారులకు బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేసి వదిలేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాత్రి 12.30 తర్వాత ఎవరూ రోడ్ల మీద ఇష్టం వచ్చినట్లు చేయొద్దని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్

గోవిందరావుపేట : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మండలంలోని ప్రధాన కూడల్లో పస్రా పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. చల్వాయి, గోవిందరావుపేట, పస్రా, దుంపెల్లిగూడెం, మచ్చాపూర్, మొద్దులగూడెం గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎస్సై అచ్చ కమలాకర్ మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచే ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేపట్టారు. రోడ్ల మీద నిఘా ఏర్పాట్లు చేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించారు.

ఆనందోత్సాహాలతో న్యూ ఇయర్ వేడుకలు



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



వాకిళ్లను ముగ్గుతో అలంకరిస్తున్న చిన్నారులు



మంగపేటలో..

మంగపేట : మండలంలోని అన్ని వర్గాల ప్రజలు, యువత న్యూ ఇయర్ వేడుకలను మంగళవారం అర్ధరాత్రి ఆనందోత్సాలహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. కొత్తదనం క్రేజ్‌తో యువకులు, బంధువులు మంగళవారం పాత సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ కేక్‌లు కట్ చేయడం స్వీట్లు పంచుతూ హంగామా చేశారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా బేకరిలు, హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల నిర్వాహకులు బిర్యానీ, పలురకాల స్వీట్లు తదితర ప్రత్యేక వంటకాల కొనుగోళ్లపై ముందుగానే ఆఫర్లు ప్రకటించారు. దీంతో కొనుగోలు దారులతో విక్రయాలు ఊపందుకుని రాత్రి 12 గంటల వరకు రద్దీ నెలకొంది. మండలంలోని వివిధ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి 12 గంటలకు కేక్ కట్‌చేసి వేడుకలను జరుపుకున్నారు. రాత్రి 10 గంటల నుంచే ఇళ్ల ఎదుట నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ రంగుల ముగ్గులతో అలంకరించారు.



మండల కేంద్రంలో కొనుగోలుదారుల సందడి



న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న శ్రీవైష్ణవి పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు

కేజీబీవీ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

చిట్యాల : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఎదుట ఏబీవీపీ నాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి బుర్ర అభిజ్ఞ మాట్లాడుతూ.. 25 రోజుల నుంచి పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు సిలబస్ పూర్తికావడం లేదని, దీంతో నష్టపోతున్నారని చెప్పారు. కనీసం వారిని పట్టించుకున్న పాపాన పోలేదని వివరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి విద్యార్థులు నష్టపోకుండా సిలబస్ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అవినాష్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



భూపాలపల్లి రూరల్ : సింగరేణి కేటీకే–1 ఇంక్లైన్ గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేసి పదవి విరమణ పొందిన అంబటి లక్ష్మణ్‌ను మంగళవారం గని అధికారులు ఐఎన్‌టీయూసీ నాయకులు సన్మానించారు. ఈసందర్భంగా మేనేజర్ తిరుపతి, ఇంజనీర్ ప్రవీణ్ మాట్లాడారు. కార్మికులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన



కాళేశ్వరం : మహదేవపూర్ మండలం ఎలికేశ్వరం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవాన్ని తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, అంటరానితనం చూపకూడదని వివరించారు. వివక్షను నిర్మూలించేందుకు చట్ట పరమైన ఎటువంటి చర్యలు తీసుకుంటారో వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కృష్ణ, గిర్దావర్ బి.జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.